సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



నాటి స్ఫూర్తి.. నేటి ఘనకీర్తి

ఎంతోమంది స్వాతంత్య్ర సమరయోధులు నడయాడిన పరిగి మండలంలోని సేవా మందిరం కీర్తి దశదిశలా పాకింది. అదే స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తోంది. 8లో



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.7°/18.1°

జిల్లా పరిధిలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని ఎస్పీ రత్న తెలిపారు.


కందుల కొనుగోలుకు అనుమతి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కందులు కొనుగోలు చేయడానికి అనుమతి లభించిందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి రైతు సేవ కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ- క్రాప్ నమోదు చేయించిన రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: అయ్యప్పమాలధారులను దృష్టిలో ఉంచుకుని జనవరిలో శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-కొట్టాయం (07065) మధ్య జనవరి 7,14,21,28వ తేదీల్లో రైళ్లు నడుస్తాయన్నారు. హైదరాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయం చేరతాయన్నారు. తిరిగి అక్కడ సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు హైదరాబాద్ జంక్షన్‌కు చేరుకుంటాయన్నారు. బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండురూ, శీరం, యాదగిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణుగుంట, కాట్పాడి, జోలర్‌పేట్, శేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, తిరుసూర్, అల్వా, ఎర్నాకులం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ఫస్ట్ కాస్ల్, సెకండ్‌క్లాస్, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాస్‌తోపాటు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉద్యోగులపై రాజకీయ పెత్తనం

- సమస్యలకు కారకులుగా ముద్ర
- సచివాలయ సిబ్బందికి తప్పని తిప్పలు
- చిరుద్యోగులకు భరోసా ఇవ్వని అధికారులు
- ఇటీవల కాలంలో ఒత్తిళ్లతో నలుగురు ఆత్మహత్యాయత్నం

సచివాలయ ఉద్యోగులు పనితీరు మార్చుకోకుంటే మాటలతో చెప్పేది లేదని, కఠిన చర్యలు తప్పవని సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు రెవెన్యూ సదస్సులో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. అంతకుముందు రోజు కొత్తచెరువులో డ్రిప్ పరికరాల పంపిణీలో రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే సాకుతో ఏపీఎంఐపీ మేనేజర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సమస్యలు ఉద్యోగుల కారణంగానే తలెత్తుతున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. ఇటీవల అనంతపురంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె పైవిధంగా పేర్కొన్నారు. ఉద్యోగులు సక్రమంగా పని చేయడం నేర్చుకోవాలని ఆమె సూచించారు. ఉద్యోగుల తీరుపై ఆమె విమర్శలు గుప్పించడంతో ఉద్యోగ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.



సోమందేపల్లిలో ఉద్యోగికి వార్నింగ్ ఇస్తోన్న మంత్రి సవిత (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగుల సమస్యలు తీరుతాయని చాలామంది భావించారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. కూటమి పార్టీల్లోని ఎమ్మెల్యేలందరూ తమ పనితీరు మరిచి.. ఉద్యోగుల పనితీరు బాగోలేదని విమర్శించడం చర్చకు దారి తీసింది. నిజానికి ఎవరి పనితీరూ బాగో లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు రెవెన్యూ సమస్యలకు ప్రధాన కారణం ఉద్యోగులేనని జిల్లాస్థాయి అధికారులు కూడా చెబుతుండటంతో.. ఎవరు ఎవరి గురించి మాట్లాడుతున్నారో? ఎవరి కోసం పని చేయాలో? అర్థం కాక చిరుద్యోగులు నలిగిపోతున్నారు. ప్రతి చిన్న విషయాన్నీ రాద్ధాంతం చేస్తూ నిత్యం రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేసే ఉద్యోగ సంఘాల నాయకులు సైతం నోరు మెదపడం లేదు. దీంతో ప్రభుత్వ పని తీరుపై ప్రజలు బేజారు పడుతున్నారు.

చిరుద్యోగులపై బ్రహ్మాస్త్రం

రెవెనూ ఉద్యోగుల నిర్వాకంతో భూ తగాదాలు పెరిగాయని గ్రామాల్లో చెబుతున్నారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకే కొందరు ఉద్యోగులు విధి నిర్వహణలో గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. ఫలితంగా ఉద్యోగులపై రెవెన్యూ సమస్యల భారం మోపుతున్నారని తెలిసింది. తాము చెప్పినట్లు వినకుంటే బదిలీ చేస్తామని బెదిరిస్తున్నారు. చెప్పినట్లు చేస్తే.. జిల్లా స్థాయి అధికారుల నుంచి నోటీసులు వస్తున్నాయి. దీంతో కింది స్థాయి ఉద్యోగులకు కూటమి ప్రభుత్వంలో మనశ్శాంతి కరువైంది.

వినకుంటే వార్నింగ్

భూ సమస్యలపై తాము చెప్పినట్లు వినాల్సిందేనని చిన్నస్థాయి ఉద్యోగులపై కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నారు. చెప్పిన పని చేయకుంటే వెళ్లిపోండి అని వార్నింగ్ ఇస్తున్నారు. ప్రజాప్రతినిధుల సూచన మేరకు విధులు నిర్వర్తిస్తే రెవెన్యూ తగాదాలు ఏర్పడుతున్నాయి. ఆ తర్వాత ఆ ప్రజాప్రతినిధులే వార్నింగ్ ఇస్తారు. ఇలా చేశారు? అలా చేశారు? పని చేతకాకుంటే వెళ్లిపోండి అంటూ దబాయిస్తున్నారు. చిరుద్యోగులతోనే సమస్యలు తలెత్తుతున్నాయని ఉన్నతాధికారుల నుంచి కూడా నోటీసులు ఆగడం లేదు.

సవతి బిడ్డల్లా చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను పావులుగా వాడుకుంటోంది. పదోన్నతుల ఆశ చూపి.. అధికారంలోకి వచ్చాక మరిచారు. పైస్థాయి అధికారుల నుంచి సహకారం కరువైంది. సచివాలయ ఉద్యోగులను సవతి బిడ్డల్లా చూస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నలుగురు సచివాలయ ఉద్యోగులు ఆత్మహత్యాయత్నం చేశారు. వైఎస్ జగన్ మార్కు తుడిచేయాలనే ఉద్దేశంతో ఉద్యోగులపై ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– వి.సురేందర్‌రెడ్డి, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

పని ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి



సచివాలయ ఉద్యోగులను పని ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఎక్కడా మౌలిక వసతులు కల్పించడం లేదు. రీసర్వే, జియో ట్యాగింగ్, కుళాయి పన్ను, ఇంటి పన్ను తదితర లెక్క లేనన్ని డ్యూటీలు విధించి వేధింపులకు గురి చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పక్కన బెట్టి.. ఉద్యోగం మానేసేలా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ పాలకుల తీరు మార్చుకోవాలి.

– రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్, పుట్టపర్తి

సర్కారు భరోసా కావాలి



ఉద్యోగులకు సర్కారు నుంచి భరోసా ఉండాలి. సమస్యలు ఉన్నా పరిష్కరించే దిశగా మార్గం సూచించాలి. సమస్యలు పదేపదే పునరావృతం కారాదు. చాలా చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వసతులు కూడా లేనట్లు తెలిసింది. ఉన్నతస్థాయి అధికారులు చిరుద్యోగులను వేధించరాదు. రాజకీయ నాయకులు చెప్పినట్లు వినాలనే నిబంధన ఏనాడూ లేదు.

– లింగా రామమోహన్, ఎన్‌జీఓ సంఘం, పుట్టపర్తి

మిక్స్‌డ్ జెండర్ టోర్నీ విజేత 'రాప్తాడు'



ఆనందంలో క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో మిక్స్‌డ్ జెండర్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం నిర్వహించారు. మిక్స్‌డ్ జెండర్ లీగ్ విజేతగా రాప్తాడు, రన్నర్స్‌గా ఆత్మకూరు జట్లు నిలిచాయి. ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా హిందూపురం టౌన్, హాకీ పోటీల్లో విజేతగా కళ్యాణదుర్గం జట్లు నిలిచాయి. అనంతరం క్రికెట్ ఫైనల్ లీగ్ మ్యాచ్ రాప్తాడు, ఆత్మకూరు జట్ల మధ్య జరిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆత్మకూరు జట్టు 9 వికెట్లు నష్టపోయి 56 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు 11.2 ఓవర్లలోనే రెండు వికెట్లు నష్టపోయి 57 పరుగులు సాధించి విజయకేతనం ఎగరేసింది.

ఏక కాలంలో శిక్షణ, పరీక్షలు ఎలా సాధ్యం?

- రాష్ట్రోపాధ్యాయ సంఘం


అనంతపురం ఎడ్యుకేషన్: 'రాష్ట్ర వ్యాప్తంగా 1, 2 తరగతుల టీచర్లకు నాల్గో విడత ఎఫ్ఎల్ఎన్, ఎంఈఓలు, హెచ్ఎంలకు లీడర్‌షిప్ శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మరోవైపు విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇలా ఓవైపు శిక్షణ, మరోవైపు పరీక్షలు ఎలా సాధ్యమవుతాయో చెప్పాల'ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంఘాలు అభ్యంతరం చెబుతున్నా ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే శిక్షణలో ఇద్దరు ఉపాధ్యాయులు మరణించినా తాజాగా ఉదయం 5:30 నుంచి రాత్రి 9 గంటల వరకు శిక్షణ షెడ్యూల్ విడుదల చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పిల్లలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాలల్లో ఒకరు శిక్షణకు హాజరైతే అన్ని పరీక్షల నిర్వహణ ఒకరితో ఎలా సాధ్యపడుతుందో అధికారులు ఆలోచించాలన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత మండల కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పిల్లలపై చిన్నచూపు

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రీషియన్ రీహాబిలిటేషన్ సెంటర్‌లో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉదయం, సాయంత్రం షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నా కేవలం ఉదయం 9 గంటలకు రౌండ్స్ వేసుకుని మధ్యాహ్నం 12 గంటలకంతా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇదిలా ఉంటే, గత నెలలో వైద్యురాలు, మరో ఉద్యోగి సెలవు తీసుకుని కూడా బయోమెట్రిక్ వేసుకుంటూ ఫుల్‌గా జీతం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. చిన్నారుల విషయంలో వైద్యులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

దేవుడే దిక్కు..

పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారికి న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 14 రోజుల పాటు వైద్యం అందిస్తారు. ఇక్కడ మొత్తం 15 పడకలు అందుబాటులో ఉన్నాయి. పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులకు తీవ్ర జ్వరం, ఫిట్స్ వచ్చినప్పుడు సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాలకు ప్రమాదం. అయినా, తమ పని తమదే అన్నట్లుగా వైద్యులు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఓపీకి వెళ్తున్నామని, హెచ్ఓడీ వద్దకు వెళ్లాల్సి ఉందని చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలిసింది. ఇక.. ఎన్ఆర్‌సీలో సెక్యూరిటీ, అటెండర్ లేకపోవడం మరో సమస్యగా మారింది. అడ్మిషన్‌లో ఉన్న చిన్నారులకు జ్వరం, ఫిట్స్, నిమోనియా వస్తే వారి తీసుకుని మూడో అంతస్తులో ఉన్న చిన్నపిల్లల వార్డుకు స్టాఫ్ నర్సులే అవస్థలు పడుతూ తీసుకెళ్తున్నారు.



సర్వజనాస్పత్రిలోని ఎన్ఆర్‌సీలో అందుబాటులో లేని వైద్యులు

పని చేయని ఏసీలు, ఫ్యాన్లు..

ఎన్ఆర్‌సీలో ఏసీలు రిపేరీలో ఉన్నాయి. వాస్తవంగా నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎన్ఆర్‌సీ నిర్వహణ జరుగుతోంది. పర్యవేక్షణ బాధ్యత మాత్రం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులపై ఉంది. ఎన్ఆర్‌సీకి రూ.లక్షల్లో బడ్జెట్ ఉంటుంది. అయినా, రోగులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

ఓమినీ వాహనం దగ్ధం

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కణేకల్లు: నాగేపల్లి శివారులో హెచ్చెల్సీ గట్టుపై ఓ ఓమినీ వాహనం ఆదివారం దగ్ధమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు.. కర్ణాటకలోని దావణగెరెకు చెందిన రాజాబక్షీ, సౌకత్‌అలీఖాన్‌లు తమ కుటుంబసభ్యులు ఏడుగురితో కలిసి ప్రసిద్ధి చెందిన దర్గాహోన్నూరులోని సర్మస్‌వలీ దర్గాకు ఓమినిలో బయలుదేరారు. ఇటీవల నాగేపల్లి వద్ద హెచ్చెల్సీ బ్రిడ్జి కూలిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు బంద్ చేసి ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేశారు. కొత్తవారు కావడంతో ఈ విషయం తెలీక పాత మార్గం ద్వారానే వెళ్లారు. కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జి వద్దకు చేరుకొని అవాక్కయారు. అక్కడున్న వారిని పలకరించగా... హెచ్చెల్సీ కుడివైపు గట్టు మీదుగా వెళ్తే మెయిన్‌రోడ్డుకు చేరుకోవచ్చని చెప్పడంతో ఆ దిశగా బయలుదేరారు. మార్గమధ్యంలో రోడ్డుపై వేసిన మొక్కజొన్న సొప్ప సైలెన్సర్‌కు, ఇంజిన్ వద్ద చిక్కుకోవడంతో ఓమినీ ఆగిపోయింది. ఓవర్‌హీట్‌తో ఇలా జరిగిందని భావించిన వాహనంలోని వారు.. కొంత సేపటికి స్టార్ట్ అవుతుందని, ఆలోపు కాలకృత్యాలు తీర్చుకుందామని కిందికి దిగేశారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా ఓమినీలో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. వాహనంలో ఉంచిన దుస్తులు, నిత్యావసర సరుకులు, నాలుగు సెల్‌ఫోన్లు దగ్ధమయ్యాయి.



మంటల్లో కాలిపోయిన ఓమినీ

రిజర్వ్ స్థలాలు మాయం

- గుర్తించిన రిజర్వ్ స్థలం 13.29 ఎకరాలు
- ఇందులో సగానికి పైగా కబ్జా!
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

కదిరి: అక్రమార్కుల కన్ను మున్సిపల్ రిజర్వ్ స్థలాలపై పడింది. కదిరి మున్సిపాలిటీ పరిధిలో సెంటు రూ.20 లక్షలకు పైగా విలువ చేసే రిజర్వ్ స్థలాలను తొలుత కబ్జా చేయడం, తర్వాత తమకున్న పలుకుబడితో వాటికి పట్టాలు పొందడం, ఆ తర్వాత ఇల్లు కట్టు కోవడానికి అనుమతి కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేయడం.. పరిపాటిగా మారింది. ఇందుకు సంబంధిత అధికారులు సైతం వారికి సహకరించడంతో రిజర్వ్ స్థలాలు మాయమైపోతున్నాయి.

రిజర్వ్ స్థలాలంటే ఏవి?

మున్సిపల్ పరిధిలో అయినా.. గ్రామీణ ప్రాంతాల్లో అయినా సరే.. ఎక్కడైనా లే అవుట్లు వేయాలంటే నిబంధనల ప్రకారం కొంత రిజర్వ్ స్థలం వదిలి పెట్టాలి. ఆయా స్థలాల్లో ప్రజల కోసం కమ్యూనిటీ హాలు, గుడి, బడి, ఆట స్థలం లేదా పార్కు లాంటివి నిర్మిస్తారు. అలా వదిలిపెట్టినవే మున్సిపల్ రిజర్వ్ స్థలాలు. ఇప్పుడు అవి కబ్జాకు గురవుతున్నాయి. మరికొందరు రియల్టర్లు మున్సిపాలిటీలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టారు. అందులో రిజర్వ్ స్థలం అసలే ఉండదు.

హైకోర్టు ఆదేశాలు ఇలా...

మున్సిపల్ రిజర్వ్ స్థలాల్లో పట్టాలు ఇవ్వడం కుదరదని, ఒకవేళ అలా పట్టా పొందినా చెల్లుబాటు కావని 2007 జనవరి 31న హైకోర్టు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశాలు (డబ్ల్యూపీ నెం.15188/2006) జారీ చేసింది. మున్సిపల్ రిజర్వ్ స్థలాలు ఎక్కడైతే ఉన్నాయో వాటిని పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియచేయాలని కూడా అప్పట్లో కోర్టు ఆదేశించింది. ఇంత పక్కాగా ఆదేశాలు ఉన్నప్పటికీ రిజర్వ్ స్థలాలు కబ్జా చేస్తున్నారంటే వారికి అధికారుల సహకారంతో పాటు నాయకుల అండ కూడా ఉందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



జొన్నా కాలనీలో కబ్జాకు గురైన మున్సిపల్ రిజర్వ్ స్థలం

ఇవీ రిజర్వ్ స్థలాలు

కదిరి మున్సిపాలిటీ పరిధిలో వివిధ సర్వే నంబర్లలో మొత్తం 13.29 ఎకరాలు రిజర్వ్ స్థలం ఉంది. ఇందులో సర్వే నంబర్ 71-1, 2, 3, 4లో 30 సెంట్లు, సర్వే నంబర్ 52/1, 2, 3లో 83 సెంట్లు, సర్వే నంబర్197/1, 2, 3లో 29 సెంట్లు, సర్వే నంబర్ 172, 173, 174ఏలో 17 సెంట్లు, సర్వే నెంబర్ 150, 151, 153లో 39 సెంట్లు, సర్వే నంబర్ 226-ఏ1, 2, 3, 4, 5, 6తో పాటు 193/3లో 84 సెంట్లు, సర్వే నంబర్ 208లో 1.02 ఎకరాలు, సర్వే నంబర్ 98, 489లో 84 సెంట్లు రిజర్వు స్థలాలుగా అధికారులు గుర్తించారు. ఇంకా సర్వే నంబర్ 45-3, 46-1బీ, 48-1, 3, 4, 5లో 4 సెంట్లు, సర్వే నంబర్ 289-8బీ, 290-3, 291-3లో 44 సెంట్లు, సర్వే నంబర్ 180,181-1లో 17 సెంట్లు, 1831లో 2 బిట్లు, 836-2, 837-1, 2, అలాగే 956, 957, 959-2 సర్వే నంబర్లలో 4 బిట్లు, సర్వే నంబర్ 58-2, 3లో 22 సెంట్లు, 138లో 6 సెంట్లు, 202, 207-1 సర్వే నంబర్లలో 66 సెంట్లు, సర్వే నంబర్ 699-2, 700-2, 3, 4లో 79 సెంట్లు, సర్వే నంబర్ 150, 151,153లో 42 సెంట్లు రిజర్వు స్థలాలు ఉన్నాయి. సర్వే నంబర్ 192ఏ2, 192-2, 195,196లో 90 సెంట్లు, సర్వే నంబర్ 394-ఏ, 397-1లో 1.02 ఎకరాలు, సర్వే నంబర్ 147-1, 2, 3లో 57 సెంట్లు, సర్వే నంబర్ 146, 147, 152, 154లో 88 సెంట్లు, సర్వే నంబర్ 208-1లో 66 సెంట్లు, సర్వే నంబర్ 399, 146లో 47 సెంట్లు, సర్వే నంబర్ 399-2లో 22 సెంట్లు, సర్వే నంబర్ 205-2లో 16 సెంట్లు రిజర్వు స్థలాల జాబితాలో ఉన్నాయి. సర్వే నంబర్ 289-8బీ, 290-3, 291-3లలో 44 సెంట్లు, 180, 181-1లలో 17 సెంట్లు, 774-4లో 3 సెంట్లు, సర్వే నంబర్ 1831లో 38 సెంట్లు, సర్వే నంబర్ 836-2, 837-1, 2, అలాగే 956, 957, 959-2లో 1.13 ఎకరాలు, 58-2, 3లో 22 సెంట్లు, సర్వేనంబర్ 138లో 6 సెంట్లు, సర్వే నంబర్ 202, 207-1బీలో 66 సెంట్లు, సర్వే నంబర్ 699-2, 700-2, 3, 4లో 79 సెంట్లు రిజర్వు స్థలాలుగా మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో చాలా వరకు కబ్జాదారుల కబంధ హస్తాల్లో ఉన్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లలో కొనరాదు



మున్సిపల్ పరిధిలో అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేసిన చోట ప్రజలెవ్వరూ ప్లాట్లు కొనుగోలు చేయరాదు. అక్కడ ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వడం కుదరదు. రిజర్వ్ స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైతే రిజర్వ్ స్థలాలు ఉన్నాయో వాటన్నింటికీ కంచె వేసేలా చూస్తాం.

– మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్, కదిరి

రైట్..రైట్..

- మూతపడిన పెనుకొండ ఆర్టీఓ చెక్‌పోస్ట్
- పన్నులు చెల్లించకుండా వెళ్తున్న వాహనాలు
- రవాణా శాఖ ఆదాయానికి భారీగా గండి

పెనుకొండ: రవాణా శాఖకు పన్నుల రూపంలో ఆదాయం తెచ్చిపెట్టే చెక్‌పోస్టు మూతపడింది. ఇదే పన్ను కట్టకుండా తిరిగే వాహనదారులకు వరంగా మారింది. పెనుకొండ సమీపంలో కీలకమైన 44వ జాతీయ రహదారిపై ఉండే ఆర్టీఓ చెక్‌పోస్టు మీదుగా ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, హర్యాణా, యూపీ, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ చెక్‌పోస్టు నిరవధికంగా మూతపడటంతో అంతర్రాష్ట్ర పన్నులతో పాటు సాధారణ పన్నులు చెల్లించకుండా పలు లారీలు, కంటైనర్లు, కార్లు, జీపులు రయ్ మంటూ వెళ్లిపోతున్నాయి. దీంతో రవాణా శాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

తనిఖీలు నామమాత్రమే..

రహదారుల్లో తనిఖీలు నిర్వహించి పన్నులు వసూలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన మేరకు ఆర్టీఏ అధికారులు చెక్‌పోస్టు మూసివేశారు. అయితే కేంద్రం నిర్ణయం సత్ఫలితాన్ని ఇవ్వడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఎంవీఐ ఏ దారిలో వెళ్లి వాహనాలు తనిఖీ చేపట్టడం ఎంత వరకు సాధ్యమనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒక దారిలో తనిఖీ చేస్తుంటే మరోదారిలో ఇతర రాష్ట్రాల వాహనాలు గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. దీని వల్ల పన్ను వసూలు సాధ్యం కాదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే చెక్‌పోస్టు కార్యాలయం ఉంటే పన్నూ వసూలుకు సులువుగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. కియా కార్ల పరిశ్రమ వద్ద తిరుగుతున్న వాహనాల్లో 90 శాతం కంటైనర్లు, ఇతర వాహనాలు ఇతర రాష్ట్రాలకు చెందినవే. వీటిలో అనేక వాహనాలు ట్యాక్సులు చెల్లించకుండా నడుస్తున్నట్లు సమాచారం.



మూసివేసిన పెనుకొండ ఆర్టీఓ చెక్‌పోస్ట్ ఇదే

రూ. 4 కోట్ల మేర ఆదాయం

పెనుకొండ ఆర్టీఓ చెక్‌పోస్టు ద్వారా ఏటా రూ. 4 కోట్ల మేర ట్యాక్సుల రూపంలో ప్రభుత్వాలకు వెళ్లేది. ప్రభుత్వం విధించిన టార్గెట్‌ను ఎంవీఐలు ముక్కు పిండి వసూలు చేసేవారు. ప్రతి వాహనంపై ప్రత్యేక నిఘా పెట్టి పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి పన్నులు వసూలు చేసే అవకాశం ఉండేది. కానీ నేడు ఆ అవకాశం లేకపోవడంతో అక్రమంగా తిరుగుతున్న వాహనాల యజమానులకు ఊరటనిచ్చినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి చెక్‌పోస్ట్ పునఃప్రారంభానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుంటున్న అధికారులు

ముదిగుబ్బ: మండలంలోని ఉప్పలపాడు వద్ద ఉన్న చిత్రావతి నది నుంచి ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ శివరాముడు, తహసీల్దార్ నారాయణస్వామి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలను పరిశీలించిన ఏడీ

ధర్మవరం రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపేట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలను జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ లాజర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో 561 మంది విద్యార్థులకు గాను 543 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పరీక్ష చీఫ్ అధికారులు సుమన, రమేష్, శైలజ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ప్రమీల, ఉమాపతి, అనంత పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎన్‌పీకుంట: మండల కేంద్రం పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వలీ బాషా తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. జూదరుల నుంచి రూ.23,350 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న ఐచర్... డ్రైవర్ దుర్మరణం



వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్ అనిల్ మృతదేహం

హిందూపురం అర్బన్: మండలంలోని అప్పలకుంట వద్ద చెట్టును ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. బెంగళూరు– హిందూపురం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని అనిల్ (47)గా గుర్తించారు. వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నాటి స్ఫూర్తి.. నేటి ఘన కీర్తి

సందర్భం: రేపు ఏఎం లింగణ్ణ జయంతి



ఏఎం.లింగణ్ణ (ఫైల్)

'విద్యతోనే చైతన్యం వెల్లివిరుస్తుంది. తద్వారా బ్రిటిష్ పాలకుల బానిసత్వ సంకెళ్ల నుంచి సులువుగా బయటపడవచ్చు. ప్రతి భారతీయుడూ విద్యావంతుడు కావాలి' అంటూ నాడు మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపునకు స్పందించిన ఏఎం లింగణ్ణ.. చిన్న వయస్సులోనే స్థాపించిన సేవామందిరం నేటికీ అదే స్ఫూర్తితో కొనసాగుతోంది. కేవలం 'విద్యతోనే చైతన్యం' నినాదానికే పరిమితం కాకుండా మహాత్మాగాంధీ, ఏఎం లింగణ్ణ ఆశయాలకు వారధిగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. కొందరు తమ స్వార్థం కోసం సంస్థలు స్థాపించి లక్ష్యం నెరవేరిన తర్వాత సేవకు స్వస్తి పలకడం చరిత్ర చెప్పిన సత్యం. అలాంటి సంస్థలకు భిన్నంగా ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో ప్రారంభమైన సేవామందిరం... సామాజిక సేవే కొలబద్ధగా.. మానవీయ ఉపకారమే మార్గంగా.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రతిఫలంగా .. నేటికీ కొనసాగుతోంది.

- 6 దశాబ్దాలుగా జాతీయ సమైక్యతా భావాన్ని చాటుతున్న సేవామందిరం
- నిత్యం టోపీధారణతో పాఠశాలకు విద్యార్థులు
- మహాత్మాగాంధీ, ఏఎం లింగణ్ణ ఆశయాలకు వారధిగా నిలుస్తున్న వైనం



యోగా చేస్తున్న విద్యార్థులు



తెల్లని దుస్తులు, టోపీ ధారణతో హాజరైన విద్యార్థులు

పరిగి: ఎంతో మంది దేశ స్వాతంత్ర్యోద్యమ నాయకులు కాలు మోపిన పరిగి మండలంలోని సేవామందిరానికి చరిత్ర పుటల్లో తనకంటూ ప్రత్యేకత ఉంది. నాడు బ్రిటీష్ పాలకులను దేశం నుంచి సాగనంపడానికి ప్రతి భారతీయుడూ విద్యావంతుడవ్వాలన్న మహాత్మగాంధీ పిలుపుతో అప్పటి ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఏఎం లింగణ్ణ స్థాపించిన సేవా మందిరం నాటి నుంచి నేటి వరకూ అదే ఆశయ స్ఫూర్తితో కొనసాగుతోంది. నాణ్యమైన విద్యతో పాటు చైతన్య దీప్తిని నిర్వాహకులు రగిలిస్తున్నారు.

స్ఫూర్తిదాయక జీవనం..

1905, డిసెంబరు 10న కర్ణాటకలోని శిరా తాలూకా పట్టనాయకహళ్లిలో మరియమ్మ, అట్టణ్ణ దంపతులకు ఏఎం లింగణ్ణ జన్మించారు. కంబళ్ల వ్యాపారంతో జీవనం సాగించే వారు బతుకు తెరువులో భాగంగా హిందూపురం ప్రాంతానికి వలస వచ్చారు. అక్కడి సత్యనారాయణపేటలో నివాసముంటూ సోమేశ్వర కంబళ్ల సొసైటీని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకున్న నాటి రోజుల్లో మహాత్మాగాంధీ పిలుపుతో చైతన్యవంతుడైన ఏఎం లింగణ్ణ ప్రజలను విద్యావంతులను చేయాలన్న ఏకైక లక్ష్యంతో నాడు దయ్యాలదిన్నెగా పిలవబడుతున్న ప్రాంతంలో సేవా మందిరం పేరుతో ఓ విద్యాసంస్థను నెలకొల్పారు. జాతిపిత ఆశయాలకు అనుగుణంగా సేవామందిరం నిర్మాణానికి చక్రవర్తి రాజగోపాలాచారి శంకుస్థాపన చేశారు.

ఆరు దశాబ్దాల ప్రస్థానం..

1941లో గాంధీజీ పిలుపుమేరకు సత్యాగ్రహంలో పాల్గొన్న ఏఎం లింగణ్ణ 6 నెలల జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత 1943 నుంచి సేవామందిరం వేదికగా రాత్రి వేళల్లో వయోజనులకు విద్యాబుద్ధులు నేర్పి, వారిలో చైతన్యం తీసుకువచ్చారు. దేశ స్వాతంత్ర్యానంతరం సేవామందిరంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని ఏఎం లింగణ్ణ కేటాయించారు. ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు అప్పటి నిబంధనల మేరకు కార్పస్ ఫండ్‌ను కర్ణాటకలోని తన సొంతూరిలో ఉన్న స్థిరాస్తిని ఏఎం లింగణ్ణ, చౌడమ్మ దంపతులు విక్రయించి చెల్లించారు. దీంతో 1962లో సేవామందిరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. విద్యాభివృద్ధికి ఏఎం లింగణ్ణ చేసిన సేవలను స్మరిస్తూ నాటి నుంచి నేటి వరకూ ఆయన తరహాలోనే తలపై ఖద్దరు టోపీ, శరీరంపై తెల్లటి దుస్తులు ధరించే సంప్రదాయాన్ని విద్యార్థులు పాటిస్తూ వస్తున్నారు.. దేశంలోని ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ ఇలాంటి సంప్రదాయం లేదు.

సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాం



దశాబ్దాలుగా పాఠశాలలో విద్యార్థులు తలపై తెల్లని ఖద్దరు టోపీ, తెల్లటి దుస్తులు ధరించడాన్ని ఓ సంప్రదాయంగా గౌరవిస్తున్నాం. బాలురు తప్పనిసరిగా టోపీ ధరించే పాఠశాలకు వస్తారు. ప్రాంగణంలో ఉన్నంతసేపూ తప్పని సరిగా టోపీ ధరించే ఉంటారు. ఏఎం లింగణ్ణలోని జాతీయ భావాన్ని చాటుతున్నందుకు గర్వంగా ఉంది.

– శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు (ఎఫ్‌ఏసీ)

ఎంతో ప్రశాంతంగా ఉంటుంది



ఏఎం లింగణ్ణ తాతయ్యకు గుర్తుగా రోజూ తెల్లటి దుస్తులు, తలపై టోపీ ధరించడంతో మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటోంది. ప్రార్థన సమయం నుంచి సాయంత్రం వరకూ గౌరవప్రదమైన సంప్రదాయాన్ని పాటిస్తున్నాం. స్థానికంగా ఉన్న టైలర్ల వద్ద టోపీని కుట్టించుకుంటాం.

– ఎంఎస్.యశ్వంత్‌రెడ్డి, 10వ తరగతి

వెలితిగా ఉంటుంది



టోపీ ధరించకుండా పాఠశాలకు వస్తే ఏదో వెలితిగా ఉంటుంది. ఏన్నో ఏళ్లుగా పాఠశాలలో పాటిస్తున్న సంప్రదాయం అలవాటుగా మారిపోయింది. టోపీ ధరిస్తే ఏదో తెలియని జాతీయతా భావం కలుగుతుంది. శుక్రవారం మాత్రం తెల్లని టోపీతో పాటూ వైట్ అండ్ వైట్ యూనిఫారంతో వస్తాం.

– కుషామంత్, విద్యార్థి, 10వ తరగతి

బీఈడీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలో బీఈడీ కోర్సులో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9న కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంది. ఎడ్‌సెట్–2024లో అర్హత సాధించి, కోర్సు పూర్తి చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు ఎస్కేయూలోని బీఈడీ కళాశాలకు నేరుగా హాజరుకావాలి. అడ్మిషన్ పొందిన వారు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుంది. స్పాట్ అడ్మిషన్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.



'నవ విధ భక్తి మార్గాలు' నృత్య రూపకంలోని ఓ ఘట్టం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న రంగారెడ్డి జిల్లా సాయి యూత్ బృందం

ఆకట్టుకున్న 'అహం సత్య బోధక'

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన రంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు మహాసమాధి సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవాన్ని చాటారు. ఆదివారం ఉదయం 'నవ విధ భక్తి మార్గాలు' పేరుతో చిన్నారులు సంగీత నృత్యరూపకం నిర్వహించారు. సత్యసాయి బోధనల మేరకు భక్తుడు భగవంతుని కృపను సాధించే క్రమాన్ని నృత్యరూపకం ద్వారా వివరించారు. సాయంత్రం రంగారెడ్డి జిల్లా సత్యసాయి యూత్ బృందం 'అహం సత్య బోధక' పేరుతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది.

వ్యక్తి అదృశ్యం



రాఘవ (ఫైల్)

నార్పల: మండల కేంద్రానికి చెందిన రాఘవ(44) కనిపించడం లేదు. పోలీసులు తెలిపిన మేరకు... డ్రైవింగ్ వృత్తిలో కొనసాగుతున్న రాఘవకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవాడు. కరోనా విపత్కర పరిస్థితుల్లో తన వాహనంలో కరోనా బాధితులను ఉచితంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చేర్చాడు. ఇటీవల నార్పలలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో తాను నివాసముంటున్న ఇల్లు దెబ్బతినింది. దీంతో అధికారుల అనుమతితో ఇంటిని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నాడు. అయితే కాంప్లెక్స్ నిర్మాణ దశలోనే చాలా మంది నుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన భార్యకు సెల్‌ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లొస్తానంటూ చెప్పిన వ్యక్తి చీకటి పడినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పలువురికి తెలపడంతో రాఘవ సన్నిహితులు చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

ఏఆర్ జట్టు గెలుపు

అనంతపురం: పోలీస్ పరేడ్ మైదానం వేదికగా ఆదివారం ప్రారంభమైన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్‌లో భాగంగా తొలిరోజు జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం అర్బన్ సబ్‌డివిజన్ జట్టుపై ఏఆర్ విభాగం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 110 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏఆర్ జట్టు 12.5 ఓవర్లలో 114 పరుగులు చేసి గెలుపొందింది. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్‌ఐ రాముడు, ఎస్‌ఐ రుష్యేంద్రబాబు, ఆర్‌ఎస్‌ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్ ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

బుక్కరాయసముద్రం: పంటలు సాగు చేసే సమయంలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. విత్తన రకాలపై బీకేఎస్ మండలం రెడ్డిపల్లిలోని కేవీకేలో ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ... ఆగస్ట్ – 11న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా విడుదల చేసిన 109 వ్యవసాయ, పండ్ల తోటల రకాల్లో 54 రకాలను దూరదర్శన్ కృషి చానల్ కార్యక్రమం ద్వారా రైతులకు చూపించారు. పప్పుశనగలో ఎన్‌బీఈజీ–1267, పెసరలో ఎల్‌జీజీ–610, వేరుశనగలో టీసీజీఎస్–1707 రకాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల భూములకు ఎంతో అనువైనవన్నారు. ఆయా రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శశికళ, డాక్టర్ కిషోర్, డాక్టర్ మాధవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈనెల 11 తర్వాత జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న లాంటి పంటలను వెంటనే తొలగించి కంబైన్డ్ హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేపట్టాలని సూచించారు. గత 10 రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురిసిన నేపథ్యంలో కంది, పప్పుశనగ రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పప్పుశనగకు ఆశించిన రబ్బరుపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు ఎకరాకు 100 మి.లీ 8.33 శాతం ఫ్లూబెండమైడ్ + 5.56 డెల్టామైత్రీన్ మందులు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే కందికి ఆశించిన శనగపచ్చ పురుగు, గూడు పురుగు నివారణకు 4.5 శాతం ఇండాక్సికార్బ్ + 5.2 శాతం నొవాల్యురాన్ ఎకరాకు 350 మి.లీ మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదంటే 9.3 శాతం క్లోరాన్‌ట్రానిలిప్రోల్ + 4.6 శాతం లామ్డాసైహాలోత్రీన్ ఎకరాకు 80 మి.లీ మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీ వరకు రబీలో వేరుశనగ విత్తుకు అనుకూలమని పేర్కొన్నారు.

'అనంత' పోలీసుల పల్లె నిద్ర

- ఎస్‌ఐ మొదలు ఉన్నతాధికారుల వరకూ రాత్రంతా గ్రామాల్లోనే
- సమస్యలు తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో నమోదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

అనంతపురం : అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు సమస్యాత్మక గ్రామాల్లో అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం మొదలైంది. జిల్లాలో సమస్యాత్మకంగా ఇప్పటికే 63 గ్రామాలను గుర్తించగా... ఇందులో తొలిరోజు ఆదివారం రాత్రి యల్లనూరు మండలం వెన్నపూసపల్లి, తాడిపత్రి మండలం వీరాపురం, ఉరవకొండ మండలం బూదిగవి, విడపనకల్లు మండలం ఆర్.కొట్టాల, పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు, పుట్లూరు మండలం చింతకుంట గ్రామంలో ఆయా ప్రాంత ఎస్‌ఐ స్థాయి మొదలు... ఉన్నతాధికారుల వరకూ పల్లె నిద్ర చేశారు. ఇందులో భాగంగా గ్రామస్తుల్లో రాత్రి గ్రామసభ ఏర్పాటు చేసి, సమస్యలపై ఆరా తీశారు. అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులకు సూచించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల జోలికెళ్లకుండా ఉండాలన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని.. ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరిస్తున్నారు.గ్రామాల వారీగా వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏదైనా సమస్య తలెత్తినా... ఘటన జరిగినా వెంటనే స్పందించే కార్యాచరణకు ఈ డేటా దోహదపడనుంది. అనంతరం సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ చట్టాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, డయల్ –100, 112 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నెలకొన్న చిన్నపాటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు.

నీలూరు చర్చి స్కూల్‌లో చోరీ



స్కూల్‌కు వేసిన కన్నం

పామిడి: మండలంలోని నీలూరు సీఎస్‌ఐ చర్చి స్కూల్‌లో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి స్కూల్ వెనుక ఉన్న కిటికీ కింద పెళ్ల తొలగించి కన్నం వేసిన దుండగులు లోపలికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. అందులోని సామగ్రిని చెల్లాచెదురు చేసి, రికార్డులతో పాటు స్టీలు సామగ్రిని అపహరించారు. టీవీ, రెండు టేప్ రికార్డ్‌లను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్కూల్ హెచ్‌ఎం సంజీవకుమార్, చర్చి సభ్యులు అబ్రహం, ప్రకాష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

తాడిపత్రి టౌన్/రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఈ నెల 7న నంద్యాల జిల్లా కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి అనుమానస్పందంగా మృతి చెందిన విషయం తెలిసిందే.. అయితే 24 గంటలు గడవక ముందే పోలీసులు అనుమానస్పద మృతిని హత్యగా ధ్రువీకరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పుట్లూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇనుప రాడ్‌తో తలపై మోది హతమార్చినట్లుగా తెలిసింది. కాగా, అనుమానాస్పద మృతి ఘటనపై ఆదివారం రాత్రి ఆర్‌ఫీఎఫ్ డీఎస్పీ అనిల్‌కుమార్ సింగ్ విచారణ జరిపారు.

తాడిపత్రిలో నియంత పాలన

- జేసీ వర్గీయుల దౌర్జన్యాలు శ్రుతిమించాయి
- సీపీఐ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో నియంత పాలన సాగుతోందని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ విమర్శించారు. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాలోని కొండాపురం, ఏటూరు, బెడుదూరు ప్రాంతాల్లోని రీచ్‌ల నుంచి ఇసుకను రాయల్టీ చెల్లించి టిప్పర్లలో జిల్లాతో పాటు నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాడిపత్రి మీదుగా తరలిస్తుండగా.. వాటిని జేసీ వర్గీయులు అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టిప్పర్లలోని ఇసుకను దౌర్జన్యంగా జేసీ వర్గీయుల కాంట్రాక్ట్ పనులకు తరలించుకుపోవడం శోచనీయమన్నారు. తాడిపత్రిలో నియంత పాలన సాగుతోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. సమావేశంలో వృత్తిదారుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి సాలవేముల సూరి, సీపీఐ నాయకులు రామాంజినేయులు, రత్నమయ్య, నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రమణ, అబ్రహాం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆట విడుపు.. వినోదాల పంచ్‌లు

అనంతపురంలోని పరేడ్ మైదానం వేదికగా ఆదివారం పోలీసులకు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆహ్లాదంతో పాటు వినోదాన్ని పంచాయి. కళ్యాణదుర్గం జట్టుపై తాడిపత్రి పోలీసు జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఫోర్లు, సిక్స్‌లతో హోరెత్తించారు. ఏఆర్ ఎస్‌ఐ జాఫర్, డీఎస్పీ నీలకంఠారెడ్డి, అసోసియేషన్ సభ్యులు, తదితరులు స్వయంగా హాజరై, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఏఆర్ ఎస్‌ఐ జాఫర్ తనదైన శైలిలో కామెంటరీ చెప్పి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రేయింబవళ్లు శ్రమించిన ఖాకీలు కాస్త రిలాక్స్ అయ్యేందుకు వారం రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ట్రాఫిక్ డ్యూటీ కాదన్నో : బంతిని బాది పరుగు తీయకుండా క్రీజు వద్దనే నిలబడిన కళ్యాణదుర్గం బ్యాటర్



బంతిని వదిలేసి: భూమిని బాదేసిన తాడిపత్రి బ్యాటర్



మరీ ఇంత టాలెంటెడ్‌గా ఉన్నారే: బౌండరీ లైన్ వద్ద బంతిని వదిలేసి ముందుకెళ్లిపోయిన ఫీల్డర్



విజేత తాడిపత్రి పోలీసు జట్టుతో ఏఆర్ డీఎస్పీ నీలకంఠారెడ్డి, ఎస్‌ఐ జాఫర్